# సమాజానికి కావలసిన వాళ్ళు

వి.వి. సత్య ప్రభావతి

ఆరోజు శారద తొందరగా యింటికి వచ్చింది. రాత్రి ట్రైన్‌కి భర్త శ్రీకాంత్ ప్రయాణం. ఫ్రెండ్ పెళ్లికి రాజమండ్రి వెళుతున్నాడు. రాగానే వంట ప్రయత్నం మొదలుపెట్టింది. మరో గంటకి శ్రీకాంత్ కూడా ఆఫీస్ నుంచి వచ్చాడు.

శ్రీకాంత్ ప్రయాణానికి బ్రీఫ్‌కేస్‌లో బట్టలు అన్నీ రెడీగా పెట్టింది. రాగానే శ్రీకాంత్ బ్రీఫ్ కేస్‌లో చెప్పులు, బ్రష్, పేస్ట్ మొదలైనవన్నీ సర్దుకున్నాడు.

''శారదా!'' అన్నాడు ఆలోచిస్తూ.

''ఆ! చెప్పండి.'' అంది శారద చపాతీలు కాలుస్తూ.

''నీవు ఒక వారం రోజులు లీవు పెట్టగలవా?'' అన్నాడు.

''ఆ! పెట్టగలను. యింతకీ విషయం ఏమిటి?'' అంది నవ్వుతూ.

''నేను రాజమండ్రిదాకా వెళ్తున్నాను కదా! అట్నుంచి జయక్క దగ్గరకి వెళ్లొస్తాను. వస్తే నాతో తీసుకొస్తాను. వారం రోజులు సిటీ చూపించి పంపిస్తే బాగుంటుందని అన్పించింది'' అన్నాడు శ్రీకాంత్.

''దానికేం భాగ్యం! తప్పకుండా తీసుకురండి. వెళ్లేప్పుడు చీర కూడా పెడదాం. ఆడపడుచుని అప్పుడప్పుడు తీసుకొచ్చి బట్టలు పెట్టాలి. అది మనకే మంచిది. భగవంతుడి దయవల్ల మనకి దేనికి లోటులేదు. యిద్దరికీ వుద్యోగాలు. పిల్లలిద్దరు యింకా చిన్నపిల్లలు. మీరు వచ్చేటప్పటికి చీర కూడా కొని వుంచుతాను'' అంది శారద.

శ్రీకాంత్ శారద 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లా వుంటారు. ఒకర్ని ఒకరు గౌరవించుకుంటారు. ఒకరి మాటని మరొకరు కాదనరు సాధారణంగా. ఇద్దరివి సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగాలు. పిల్ల క్రాంతికి పదేళ్లు, పిల్లాడు కాశ్యప్‌కి ఎనిమిదేళ్లు. సొంతిల్లు. చీకు చింత లేని సంసారం.

శ్రీకాంత్ అక్క జయలక్ష్మి వుండేది చిన్నవూరు. వ్యవసాయం. దేనికీ లోటులేదు. సొంతిల్లు. ఇద్దరు ఆడపిల్లల్ని దగ్గరలోనే యిచ్చి పెళ్లిళ్లు చేసారు. ప్రస్తుతం భార్య భర్తలిద్దరే వుంటున్నారు. శారద అక్కడికి పెళ్లిళ్లకు మాత్రమే వెళ్లి వచ్చింది. వాళ్లవూరు రమ్మన్నా వాతావరణం బాగుండదు. చెమట భరించటం చాలా కష్టం అంటూ శారద వెళ్లడాన్కి ఇష్టపడేది కాదు. శ్రీకాంత్ మాత్రం అటువైపు వెళ్తే తప్పకుండా అక్కగార్ని చూసి వస్తాడు.

శ్రీకాంత్ అక్కగారి గురించి చెప్తూ వుంటాడు. నోరు పెద్దది, గయ్యాళి అని అనుకుంటారు. కాని మనసు చాలామంచిది. అని చిన్నప్పటి సంగతులు చెప్తూవుంటాడు. శారద వింటూ వుంటుంది. శ్రీకాంత్‌కి వాళ్ల జయక్క అంటే చాలాఇష్టం అని గ్రహించింది.

మూడురోజుల తర్వాత శ్రీకాంత్ జయలక్ష్మితో ఆటోదిగాడు. సామాను ఎక్కువే వుంది. గేటు తీసి ''రండి వదినా!'' అంటూ ఆహ్వానించింది శారద. ముందు గదిలో సామాను పెట్టాడు శ్రీకాంత్. శారద తెచ్చిన కాఫీ తాగి తను తెచ్చిన వస్తువులన్నీ అందించింది జయలక్ష్మి. ఒక కవరులో సున్నుండలు, లడ్డూలు, జంతికలు, జీడిపప్పు యింకా ఒక బూడిదగుమ్మడి కాయ, మంచి గుమ్మడికాయ, నారింజకాయలు అన్నీ లోపల పెట్టింది శారద.

''ఎందుకు వదినా ఇవన్నీ మీకు శ్రమ. ఇక్కడ అన్నీ దొరుకుతాయి. అరిశలు, బొబ్బట్లు దగ్గర్నుంచి అమ్ముతారు. అయినా మనం యింట్లో చేసుకుంటేనే బాగుంటాయి అనుకోండి'' అంది శారద.

''నేనేమీ శ్రమ పడలేదులే. ఆ కాయలన్నీ తోటలో కాసినవే. తినుబండారాలంటావా? నలుగురు వచ్చి చేసిపెట్టి వెళ్లారు. మాది పల్లెటూరుకదా ప్రక్కవాళ్లు సాయం చేస్తూ వుంటారు. ఎవరింట్లో ఏం చేసుకున్నా చుట్టూవున్న నలుగురు కలిసి సాయం చేస్తారు. ఇక్కడయితే ఒక్కళ్లే చేసుకోవాలి'' అంది జయలక్ష్మి.

పిల్లలు స్కూల్‌కి తయారవుతూ అత్తదగ్గరకు వచ్చారు.

''నేనెవరో తెలుసా?'' అందావిడ.

''జయత్త'' అన్నారిద్దరు కోరస్‌గా.

ఇద్దర్నీ దగ్గరకు తీసుకొని ముచ్చటపడింది జయలక్ష్మి.

''శారదా! పిల్లలిద్దరికి లడ్డూలు, సున్నుండలు టిఫిన్లలో పెట్టియ్యి. వాళ్ల స్నేహితులక్కూడా పెడతారు.''

''అలాగేలెండి. మీరు కాసేపు నడుంవాల్చండి. వాళ్లందరిని పంపించేసి వస్తాను'' అని లోపలకు వెళ్లింది. పిల్లలిద్దరు ఆటోలో స్కూల్‌కి వెళ్లారు. శ్రీకాంత్ ఆఫీస్‌కి వెళుతూ అక్కదగ్గరకు వచ్చాడు. ''అక్కా! ఈవేళ్టికి రెస్ట్ తీసుకో. రేపటి నుంచి సిటీ చూద్దువుగాని. నేను ఆఫీస్‌కి వెళ్తొస్తాను'' అని చెప్పి స్కూటర్ మీద ఆఫీస్‌కివెళ్లిపోయాడు.

పైన రెండు గదుల్లో ఒక తల్లి కొడుకు అద్దెకుంటున్నారు. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మగారు. కొడుకు ఆఫీస్‌కి వెళ్లగానే బట్టలు ఆరేసి భోజనం చేసి క్రిందకు వచ్చిందావిడ. వాళ్లిద్దర్ని ఒకరికి ఒకర్ని పరిచయం చేసింది శారద. అన్నపూర్ణగారు కొంచెంసేపు కూర్చుని వెళ్లిపోయింది.

సాయంత్రం అన్నపూర్ణమ్మగారు, జయలక్ష్మి కలిసి గుడికి బయలుదేరారు. వాళ్లు తిరిగొచ్చేసరికి పిల్లలు స్కూల్ నుంచి, శ్రీకాంత్ ఆఫీస్ నుంచి వచ్చారు.

తమ్ముణ్ణి పలకరించి ప్రక్కనే కూర్చుంది జయలక్ష్మి.

''ఎలా వున్నాయక్కా గుళ్లు?'' అన్నాడు శ్రీకాంత్.

''సాయిబాబా గుడి చాలాబాగుంది. అంత రష్‌గా వున్నా శుభ్రంగా వుంది. ప్రశాంతంగావుంది. కాకపోతే వేంకటేశ్వరస్వామి గుళ్లోనే పూజారి చాలా సోమరి. రష్ లేకపోయినా తీర్థం మూడుసార్లు చేతిలో పోయడాన్కి కూడా బద్ధకమే'' అంది జయలక్ష్మి.

అక్కగారి మాటలకి నవ్వుకున్నాడు శ్రీకాంత్. అన్నీ కుండ పగలగొట్టినట్లు చెప్తుంది అనుకున్నాడు.

రాత్రి భోజనాలు చేసేటప్పుడు అడిగారు శారదని, ''రేపు ప్రోగ్రాం ఏమిటి?'' అని.

''చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం చూస్తాం. ఎల్లుండి పబ్లిక్‌గార్డెన్స్, బిర్లామందిర్, ప్లానిటోరియం చూస్తాం. శనివారం సంఘీనగర్ వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్లొస్తాము.''

''అయితే ఆదివారం అందరం కలసి జూపార్క్‌కి వెళదాం'' అన్నాడు శ్రీకాంత్ పిల్లలిద్దరు కూడా జూ అనగానే వుత్సాహపడ్డారు.

''ఉదయం పదకొండు గంటలకి బయలుదేరండి. కొంచెం రష్ తక్కువగా వుంటుంది బస్సుల్లో'' అన్నాడు శ్రీకాంత్.

''రష్‌గా వుంటే ఆటో ఎక్కుతాంలెండి'' అంది శారద. భోజనాలు పూర్తయి టేబుల్ క్లీన్‌చేసి వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి జయలక్ష్మి శ్రీకాంత్ మాట్లాడుతూ కూర్చున్నారు.

మర్నాడు శారద, జయలక్ష్మి పదిన్నరకి భోజనాలు చేసి చార్మినార్ వెళ్లడానికి బస్ ఎక్కారు. అట్టే రష్ లేదు. సీటు కూడా దొరికింది. శారద విండోవైపు కూర్చుంది. నిల్చున్న ఒకావిడ జయలక్ష్మి భుజాన్ని ఆనుకొని నిల్చుంది. కొంచెం సర్దుకుని కూర్చున్నా ఆవిడ మరికాస్త దగ్గరగావచ్చి అలానే నిల్చుంది. జయలక్ష్మికి వళ్లు మండింది. ''స్థలం వుంది కదా! కొంచెం జరిగి నిలబడండి. భుజం నొప్పెడుతోంది'' అంది జయలక్ష్మి ఆవిడతో.

''కూర్చుని ప్రయాణం చేస్తేనే కష్టంగావుందా? అలాంటివాళ్లు ఆటోలో వెళ్లాలి'' అంది ఆవిడ కయ్యానికి దిగుతూ.

''పోనీండి వదినా! మీరు ఇటు కూర్చోండి'' అంటూ లేవబోయింది శారద.

'నువ్వుండు' అన్నట్లు చేత్తో ఆపి, ఆవిడతో అంది జయలక్ష్మి, ''ఏమన్నావు? కూర్చుని ప్రయాణం చేయడం కష్టం కాదు. నిన్ను భుజంతో మోయడం కష్టంగావుంది తల్లి. పోనీ నువ్వు కూర్చో. నేను నిన్ను ఆనుకుని నిలబడతాను మళ్లీ నోరెత్తకూడదు'' అంది జయలక్ష్మి.

అదిరిపోయిన ఆవిడ దూరంగా జరిగి నిలబడింది. కొట్లాట పెద్దది కానందుకు సంతోషించింది శారద.

శారద చూపించినవన్నీ శ్రద్ధగా గమనించింది జయలక్ష్మి. మరోరోజు బస్‌లో ప్రయాణం చేసేటప్పుడు ఒకావిడ జుట్టు వదిలేసి క్లిప్ పెట్టింది. ఆవిడ జుట్టు శారద ముఖానికి తగుల్తోంది. మాట్లాడుతుంటే నోట్లోకి వచ్చేట్టుంది. అది గమనించిన జయలక్ష్మి ఆవిడ భుజంమీద చెయ్యేసి ''మీరు ఇటువైపు తిరిగి నిల్చోండి. మీ జుట్టు చాలా అందంగా వుంది. కాని ఎదుటివాళ్లకి ఇబ్బంది కలిగించకూడదు కదా?'' అంది.

అటువైపుసీట్లో కూర్చున్నావిడతో కబుర్లు చెప్తున్న ఆవిడ కోపంగా ఇటుతిరిగి నిలుచుంది. జయలక్ష్మి ఆవిడని పట్టించుకోకుండా శారదతో కబుర్లలో పడింది.

శారదకి జయలక్ష్మితో ప్రయాణం అంటే భయం పట్టుకుంది. ఏమాత్రం సర్దుకుపోదు. ఆవిడనేవి నిజమే అయినా ఎదుటివారి తత్వాలు వేరు. వాళ్లు అడ్డంగా వాదించి తిట్లు మొదలుపెడితే భరించగలమా! అన్నది శారద భయం. శ్రీకాంత్‌తో చెపితే బాగుండదు. ఏం జరిగితే అదే జరుగుతుంది అనుకుని ధైర్యం తెచ్చుకుంది శారద.

మరోరోజు బస్‌లో ఒకాయన ముందునుంచి ఎక్కి ఆడవాళ్ల మధ్యలో నించున్నాడు. కండక్టర్ ''లోపలికి వెళ్లండి సార్'' అన్నాడు. ఆ పెద్దమనిషి ''స్టాఫ్ ఆఫీసర్ని'' అంటూ కండక్టర్ మీద అరవడం మొదలుపెట్టాడు. కండక్టర్ మెతకవాడు బిక్కముఖం వేసాడు.

అన్నీ గమనిస్తూ ప్రక్కనే నిలబడ్డ జయలక్ష్మి అందుకుంది. ''ఏమయ్యా ఆఫీసర్ని అంటున్నావు. పెద్ద చదువు చదివివుంటారు. ఇదేనా సంస్కారం. అతనేమన్నాడని అన్నిమాటలు. ముందునుంచి ఎక్కి పైగా ఆడవాళ్ల మధ్యలో నిలబడి పైగా పోట్లాటా?'' అంది గట్టిగా.

''నువ్వెవరమ్మా మధ్యలో. నీకేం ఇబ్బంది?'' అన్నాడు విసుగ్గా.

''నేనెవరైనా, నివ్వెవరైనా ప్రస్తుతం అందరం బస్సులో ప్రయాణం చేస్తున్నాము. మర్యాదగా కొంచెం వెనక్కు జరక్కపోతే అందరం కలిసి వెనక్కు నెడతాం'' అంది జయలక్ష్మి. చాలామంది ఆడవాళ్లు జయలక్ష్మికి సపోర్టింగా మాట్లాడ్డం మొదలుపెట్టారు. పరిస్థితి గమనించి ఆ పెద్దమనిషి తొందరగా ముందుకు వెళ్లిపోయి దిగిపోయాడు.

''ఇన్నాళ్లకు అన్యాయాన్ని ఎదిరించే ఆడవాళ్లని నా సర్వీసులో మొదటిసారి చూస్తున్నాను'' అన్నాడు కండక్టరు జయలక్ష్మిని అభినందిస్తూ.

బస్‌లో అన్నిరకాల వాళ్లువున్నారు. ''ఏదైనా పబ్లిక్‌లో ఇలాంటి చోట్ల అన్యాయాన్ని ఎదిరించడం మన కనీస కర్తవ్యం. అది వాళ్లిద్దరి మధ్య గొడవ మనకెందుకులే అనుకోకూడదు. ఆడవాళ్ల మధ్యలో నిలబడవద్దని మనగురించే కదా చెప్పాడు. అతన్ని సపోర్టు చేయడం మనవంతు. ఇలాంటి సందర్భాల్లో ఒకళ్లనొకళ్లు సహకరించుకోవాలి. అప్పుడే కొంతైనా సమాజంలో మార్పు వస్తుంది. అలాగని ముఠా తగాదాల్లో తలదూర్చమనికాదు'' అంటు చిన్నపాటి లెక్చరిచ్చింది జయలక్ష్మి. అందరు జయలక్ష్మిని అభినందించారు. శారద ప్రేక్షకురాలిలా వుండిపోయింది. స్టేజి రావడంతో ఇద్దరు దిగిపోయారు.

మరోరోజు జయలక్ష్మి శారద కూర్చున్న వెనకసీట్లో స్టూడెంట్స్ మగపిల్లలు కూర్చున్నారు. అది కూడా లేడీస్ సీటే. మధ్యలో ముసలావిడ నించుంది. అది లేడీస్ సీటని కూడా తెలియదనుకుంట. జయలక్ష్మి వెనక్కు తిరిగి ''ఏం చదువుతున్నారు బాబు'' అంది.

''ఇంటర్ సెకండియర్'' అన్నారు కోరస్‌గా.

''మీరు కూర్చున్నది లేడీస్ సీట్‌కదా? లేచి ఆవిడకి ఇవ్వచ్చుకదా!''

''ఆవిడ అడగలేదుగా ఆంటీ. అడిగితే ఇస్తాం.''



''అదే మీ నాయనమ్మో అవ్వో అయితే వేరేవాళ్లని లేపి మరీ కూర్చోపెట్టేవాళ్లు. అది లేడీస్ సీట్ అని కూడా తెలియదు ఆవిడకి. అందుకని మీరే లేచి పిలిచి ఇవ్వాలి'' అంది జయలక్ష్మి. వెంటనే లేచిపోయారిద్దరు.

''మామ్మగారు ఇలావచ్చి కూర్చోండి'' అంది జయలక్ష్మి. ఆవిడ వచ్చి కూర్చుంది. జయలక్ష్మి ఏమన్నా ఎవరూ ఎదురు సమాధానం చెప్పకపోవడం ఆశ్చర్యంగా అన్పించింది శారదకి. ఆదివారం అందరు కలిసి జూ పార్క్‌కి వెళ్లారు. పిల్లలతో సరదాగా తిరిగింది. ఏభై ఏళ్లయినా అందరితో కలిసిపోయే ఆవిడ వ్యక్తిత్వం శారదకి నచ్చింది. ఇన్నాళ్లనుంచి ఇంత దగ్గరగా చూడలేకపోయింది.

పిల్లలిద్దరికి కూడా జయత్త చాలా నచ్చింది. ఇంట్లో శారదకి అన్ని పనుల్లో సాయం చేసేది. ఆత్మీయంగా మాట్లాడేది. ఆవిడవల్ల ఇబ్బంది అన్పించలేదు శారదకి. జయలక్ష్మి వచ్చి వారం రోజులయింది. ''రేపు వెళతానురా బస్‌కి టికెట్ రిజర్వు చేయించు'' అంది తమ్ముడితో.

''అలాగేలే. బావగారు ఇబ్బంది పడతారని నీబెంగ'' అన్నాడు శ్రీకాంత్. ఆరోజు ఎక్కడికి వెళ్లలేదు. శ్రీకాంత్ సాయంత్రానికి టికట్ కొనిచ్చి ఆఫీస్‌కి వెళ్లిపోయాడు తొందరగా వస్తానని.

తరువాత శారదతో అంది ''శారదా! ఎంతసేపు ఇల్లు ఆఫీసేకాదు కొంచెం కాలనీలో కూడా పరిచయం చేసుకో. మనిషి సంఘజీవి అన్నమాట మర్చిపోకూడదు. నలుగురికి మనకు చేతనైన సహాయం చేయొచ్చు పొందచ్చు.''

''ఏమోనండి ఎవరితో ఏం మాట్లాడితే గొడవోనని భయం.''

''అందరు మంచివాళ్లే వుండరు. అందరు చెడ్డవాళ్లే వుండరు. ఎవరితో ఎంతవరకు వుండాలో అంతవరకే వుండాలి. సమాజానికి చదువుకున్నవాళ్ల అవసరం చాలా వుంటుంది. బయటి ప్రపంచం చూడాలి. కలిసి బ్రతకడం నేర్చుకోవాలి. జీవితం చాలా చిన్నది.''

జయలక్ష్మి మాటలు వింటే ఆశ్చర్యం వేసింది. బాగా చదువుకున్నావిడలా మాట్లాడుతోంది. ఆవిడ చదువుకోలేదని అనుకుంది ఇన్నాళ్లు. అదే భర్తని అడిగింది.

''స్వయంకృషితో ప్రైవేటుగా ఎమ్.ఏ. చదివింది. పుస్తకాలు బాగా చదువుతుంది. నాక్కూడా ఈమధ్యనే తెలిసింది'' అన్నాడు శ్రీకాంత్.

'సమాజానికి కావలసినవాళ్లు పట్టి చదువుకున్నవాళ్లే కాదు జయలక్ష్మిలాంటి ధైర్యవంతులు' అనుకుంది శారద.

★